విచక్షణ జ్ఞానం కోల్పోకుండా ప్రవర్తించాలి


జైలులో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి

గిద్దలూరు రూరల్: ప్రతి ఒక్కరూ విచక్షణ జ్ఞానం కోల్పోకుండా ప్రవర్తించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి న్యాయసేవాధికారి చైర్‌పర్సన్ ఏ.భారతి అన్నారు. పట్టణంలోని సబ్ జైలును శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమంలో ఖైదీలను ఉద్దేశించి మాట్లాడారు. క్షణికావేశంలో నేరాలకు పాల్పడి జీవితాన్ని జైలులో గడిపేందుకు వచ్చిన వారిలో పరివర్తన వచ్చేందుకు ప్రయత్నించాలన్నారు. కుటుంబ సభ్యుల మధ్య మంచి సంబంధాలు కొనసాగాలన్నారు. నేరాలకు పాల్పడి కుటుంబ సభ్యులకు దూరంగా ఉండటం చాలా ఘోరమైన శిక్ష అని అన్నారు. జైలులో ఖైదీలకు కల్పిస్తున్న మౌలిక వసతులపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ సెక్రటరీ కె.ఇబ్రహీమ్, గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్‌జడ్జి ఏ.ఓంకార్, జైలు సూపరింటెండెంట్ లింగారెడ్డి, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సాయం పొందొచ్చు

● జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి


సబ్ జైలును పరిశీలిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి

మార్కాపురం టౌన్: ఖైదీలు ఆర్థిక భారంతో కోర్టుల్లో వాదించేందుకు న్యాయవాదులను సమకూర్చుకోలేకపోతే మండల న్యాయసేవాధికార సంస్థను సంప్రదించి ఉచిత న్యాయ సాయం పొందవచ్చని జిల్లా ప్రధాన న్యాయమూర్తి భారతి తెలిపారు. శనివారం మార్కాపురం సబ్‌జైలును తనిఖీ చేసిన ఆమె ఖైదీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జైలులో ఉన్న ఖైదీలకు అందుతున్న వసతి, పారిశుధ్య పరిస్థితులపై వారిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎస్.ఇబ్రహీం షరీఫ్, మార్కాపురం ఆరో అదనపు జిల్లా జడ్జి ఎం.శుభవాణి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.బాలాజీ, ప్యానల్ లాయర్ ఉషశ్రీ,, లీగల్ వలంటీర్ షేక్ బాషా, కోర్టు, సబ్‌జైలు సిబ్బంది పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

● ఈఎస్ ఆయేషా బేగం


మాట్లాడుతున్న ఈఎస్ ఆయేషా బేగం

మార్కాపురం: ప్రజలు, యువత మద్యపానం, గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, తమ కుటుంబాలను నాశనం చేసుకోవద్దని ఒంగోలు ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్కే ఆయేషా బేగం సూచించారు. శనివారం పట్టణంలోని వెలుగు కార్యాలయంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో మద్యపానంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు, పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని చెప్పారు. మద్యపానానికి బానిసైన వ్యక్తులను అవసరమైతే డీ ఎడిక్షన్ కేంద్రాల్లో చేర్పాలని, లేకుంటే సదరు విషయాన్ని ఎక్సైజ్ సీఐకు తెలియజేస్తే ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత పునరావాస కేంద్రాల్లో చేర్పిస్తారని తెలిపారు. ఏఈఎస్ బాలయ్య, సీఐ వెంకటరెడ్డి, ఎస్సై గోపాలకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

కమనీయం..రంగనాయకుని కల్యాణం


మాంగల్యం చూపుతున్న వేదపండితులు

రాచర్ల: మండలంలోని జేపీ చెరువు గ్రామ సమీపంలోని నల్లమల అడవిలో వెలసిన నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కార్యనిర్వహణాధికారి మల్లవరపు నాగయ్య, దేవస్థానం అర్చకులైన అన్నవరపు సత్యనారాయణచార్యులు, పాండురంగాచార్యులు అశేష భక్త జనం మధ్య శ్రీదేవి, భూదేవి, నెమలిగుండ్ల రంగనాయకస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి పట్టువస్త్రాలు, ప్రత్యేక పూలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివార తీర్థప్రసాదాన్ని భక్తులకు పంచిపెట్టారు. స్వామి వారి కల్యాణంలో ఉభయదాతలతో పాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. స్వామివారి కల్యాణం తిలకించేందుకు వచ్చిన భక్తులకు కాశీనాయన రెడ్ల, యోగివేమన రెడ్ల, గోపాలకృష్ణయాదవ, కృష్ణదేవరాయుల కాపు బలిజ, ఆర్యవైశ్య, అన్నసత్రాల్లో అన్నసంతర్పణ చేశారు.

ఉగ్రవాదులకు వ్యతిరేక పోరాటమా..
అమెరికాకు లొంగుబాటా?

● మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు


మాట్లాడుతున్న లక్ష్మణరావు

మార్కాపురం: ఉగ్రవాదులకు వ్యతిరేక పోరాటమా లేక అమెరికాకు లొంగుబాటా.. అన్న విధంగా ప్రధాని నరేంద్రమోదీ వ్యవహరించారని మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ప్రశ్నించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో సమైక్యత సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యం, దేశ సమగ్రత పరిరక్షణ కోసం ముస్లింలతో పాటు దేశంలోని ప్రతి ఒక్కరూ ప్రజల తరపున ఒకేతాటిపై నిలిచారన్నారు. ఉగ్రవాదులను అణచి వేసే పేరుతో ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌ను ప్రజలు అభినందించారన్నారు. ఆ ప్రయత్నాలు ఎలా ముందుకు సాగాలి.. ఎప్పుడు సాగాలి అనే విధంగా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలిగానీ అమెరికా అధ్యక్షుడు ట్రంపు ప్రకటనతో మౌనంగా ఉండిపోవడం దేశ సార్వ భౌమత్వానికి ప్రమాదమన్నారు. కుల, మత జాతి బేధం లేకుండా దేశవ్యాప్తంగా అన్నీ తరగతుల ప్రజలు పెహల్గాం ఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారన్నారు. కశ్మీర్ ప్రజలు కూడా ఈ హత్యాకాండను తీవ్రంగా ఖండించినట్లు గుర్తు చేశారు. ప్రజల ఐక్యతను దెబ్బతీసి పక్కదారి పట్టించే ఉద్దేశపూర్వక చర్యలను మానుకోవాలని లక్ష్మణరావు హితవు పలికారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సంఘ నాయకులు గాలెయ్య, సీపీఎం, పలు మైనార్టీ సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్మికులకు ప్రభుత్వ పథకాలు ఇవ్వాలి

మార్కాపురం: స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ కార్మికుల పిల్లలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏఐటీయూసీ కార్యదర్శి షేక్ ఖాశీం డిమాండ్ చేశారు. శనివారం సీపీఐ కార్యాలయంలో ఆ పార్టీ నాయకులు మున్సిపల్ కార్మికులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఔట్‌సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగుల ఖాతాల్లో చూపుతున్నారని, దీంతో కార్మికులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన తల్లికి వందనం నగదు కూడా వారి పిల్లలకు అందడం లేదని, మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఇళ్ల స్థలాలు, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు కాశయ్య, వెంకటేశ్వర్లు, చెన్నమ్మ పాల్గొన్నారు.

వాహనదారులు జాగ్రత్తలు పాటించాలి

మార్కాపురం: వాహనదారులు తమ ప్రయాణ సమయంలో జాగ్రత్తలు పాటించినప్పుడే క్షేమంగా తమ నివాసాలకు చేరతారని టూటౌన్ ఎస్సై డాక్టర్ రాజమోహన్ తెలిపారు. శనివారం పట్టణ శివారులో ఆయన వాహనాలు తనిఖీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన పలువురికి కౌన్సిలింగ్ ఇచ్చి చలానాలు విధించారు. వాహనదారులు సీటు బెల్టు పెట్టుకోవాలని, ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు హెల్మెట్లు ధరించాలని, నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహన తనిఖీల సమయంలో దొంగతనం జరిగిన వాహనాలను గుర్తించినట్లు పేర్కొన్నారు.

కంభం బస్టాండ్‌లో కార్గో వ్యాపారానికి అవకాశం

కంభం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కార్గో సేవలు అందించేందుకు స్వల్ప అద్దెతో స్థలాన్ని కేటాయించనున్నట్లు గిద్దలూరు డిపో మేనేజర్ చంద్రశేఖర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒక కంప్యూటర్, చిన్నపాటి ప్రింటర్‌తో కార్గో వ్యాపారం ప్రారంభించుకోవచ్చని ఆసక్తి ఉన్నవారు ఆర్టీసీ అధికారులను సంప్రదిస్తే బస్టాండ్ ఆవరణలో స్థలాన్ని కేటాయిస్తామన్నారు. కార్గో సర్వీసులతో పాటు ద్వితీయ ప్రాధాన్యంగా జిరాక్స్, ఇతర సేవలు చేసుకొని ఆదాయం పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రక్తదానం ప్రాణాలను నిలబెడుతుంది


జీజీహెచ్‌లో రక్తదాతను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ మారుతీదేవి


రక్తదానం చేసిన ప్రసాద్‌ను సన్మానిస్తున్న డాక్టర్ కనకదుర్గ


రక్తదానం చేస్తున్న దప్పిలి వినోద్‌కుమార్‌రెడ్డి

మార్కాపురం టౌన్: అన్నీ దానాల్లో రక్తదానం ఎంతో గొప్పదని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మార్కాపురం సబ్ బ్రాంచి చైర్మన్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ అన్నారు. రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రావణి హాస్పిటల్, జీజీహెచ్‌లో రక్తదాతలను శనివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న మరొక ప్రాణాన్ని కాపాడాలని కోరారు. రక్తదానం చేసేందుకు ఉన్న అపోహలు వీడి రక్తదానం చేయాలని సూచించారు. రక్తదానం చేస్తే మానవ శరీరంలో పాత రక్తం పోయి కొత్త రక్తం తయారవుతుందని, దీంతో మానవ దేహానికి మంచి జరుగుతుందన్నారు. 70 సార్లు రక్తదానం చేసిన దాత ప్రసాద్‌ను పూలమాలలతో, శాలువాలతో సన్మానించారు.

జీజీహెచ్‌లో..

రక్తదాతల దినోత్సవం సందర్భంగా స్థానిక జీజీహెచ్‌లో రక్తదాన శిబిరాన్ని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మారుతీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆపదలో ఉన్న రోగులను, రక్తస్రావం జరిగిన వారికి రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చన్నారు. వైద్యశాలలో రోజూ రక్తదానం చేయవచ్చని, ఆసక్తి ఉన్న వారు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రక్తదానం ప్రాముఖ్యత గురించి పట్టణంలో ర్యాలీ చేశారు. మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్, అశోక్‌రెడ్డి, వేణుగోపాల్, సిబ్బంది రవికుమార్, చలపతిరావు, ఆంజనేయులు, విజయ జ్యోతి, శివశంకర్, సత్యవాణి పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: రక్తదానం చేయడం వల్ల ఆపదలో ఉన్న ఒకరి ప్రాణాలను నిలబెడుతుందని మేమున్నాం సేవా సమితి నిర్వాహకుడు చల్లా అశోక్‌రెడ్డి అన్నారు. ప్రపంచ రక్తదానం దినోత్సవం సందర్భంగా పట్టణంలోని గణేష్‌నగర్‌లో రమేష్ చిన్నపిల్లల వైద్యశాల ఆవరణలో శనివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పట్టణానికి చెందిన దప్పిలి వినోద్‌కుమార్‌రెడ్డి 85 వ సారి రక్తదానం చేసి అందరికి ఆదర్శప్రాయంగా నిలిచాడు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ బి.బాలయ్య యాదవ్, ముత్తుముల కిషోర్‌కుమార్, ఈశ్వరయ్య, మహేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

బేస్తవారిపేట: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ మండల అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

గిద్దలూరు నగర పంచాయతీ..

వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ అధ్యక్షునిగా పాలుగుళ్ల సుబ్బారెడ్డి, మహిళా విభాగం కావేరి నాగలక్ష్మి, రైతు విభాగం కత్తా నరసింహారెడ్డి, బీసీ సెల్ జింకా రమేష్ యాదవ్, ఎస్సీ సెల్ దండు ఓబయ్య, ఎస్టీసెల్ కాశీనాయక్, మైనార్టీ సెల్ షేక్ నూర్ మహమ్మద్, క్రిస్టియన్ మైనార్టీ సెల్ కే సువర్ణరాజు, స్టూడెంట్ వింగ్ పల్లె శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ వింగ్ కమలపట్టి వెంకటేశ్వర్లు, ఆర్టీఐ వింగ్ మనం దిలీప్‌కుమార్‌రెడ్డి, వలంటీర్స్ వింగ్ తన్నీరు సాయికుమార్, వాణిజ్య విభాగం దింటకుర్తి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్ టీయూసీ కోట రఘు, అంగన్‌వాడీ వింగ్ జీ భాగ్యలక్ష్మి, కల్చరల్ వింగ్ ప్రసాద్, సోషల్ మీడియా వింగ్ నెలటూరి శ్రీమిత్రారెడ్డి, దివ్యాంగుల విభాగం షేక్ హుస్సేన్‌షా, పబ్లిసిటీ వింగ్ ఆగోలు సాయి యాదవ్‌లను నియమించారు.

గిద్దలూరు మండలం..

వైఎస్సార్ సీపీ యూత్ వింగ్ అధ్యక్షునిగా శీలం రంగారెడ్డి, మహిళా విభాగం సమదుల వెంకట్ రాజమ్మ, రైతు విభాగం రెడ్డి మహేశ్వరరెడ్డి, బీసీ సెల్ మల్లిబోయిన నాగేశ్వరరావు, ఎస్సీ సెల్ జానవరపు కిరణ్, ఎస్టీసెల్ బుక్యా హనుమానాయక్, మైనార్టీ సెల్ షేక్ ముల్లా ముస్తాఫా, క్రిస్టియన్ మైనార్టీ సెల్ బండారి నోవెల్, స్టూడెంట్ వింగ్ ఇడువుల రవికుమార్‌రెడ్డి, పంచాయతీరాజ్ వింగ్ ఈదుల పాండు రంగారెడ్డి, ఆర్టీఐ వింగ్ పేరంరెడ్డి నరేంద్రరెడ్డి, వలంటీర్స్ వింగ్ చాగం భాస్కర్‌రెడ్డి, వాణిజ్య విభాగం కలువ సుబ్బారావు, వైఎస్సార్ టీయూసీ ఏరువా యోగానందరెడ్డి, అంగన్‌వాడీ వింగ్ ఒంటెడు సీతమ్మ, కల్చరల్ వింగ్ తిమ్మారెడ్డి రవికుమార్‌రెడ్డి, సోషల్ మీడియా వింగ్ బొల్లు నవీన్, దివ్యాంగుల విభాగం తాటగిరి పుష్పరాజ్, పబ్లిసిటీ వింగ్ చిలకల ప్రతాప్‌రెడ్డిలు నియమితులయ్యారు.

సీపీఐ మహాసభలు జయప్రదం చేయాలి

మార్కాపురం: జిల్లాలోని దర్శిలో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే సీపీఐ 17వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి షేక్ ఖాశీం శనివారం కోరారు. మహాసభలకు మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్యతో పాటు పలువురు నాయకులు హాజరవుతారని పేర్కొన్నారు. సీపీఐ కార్యాలయంలో మహాసభల కరపత్రాలను ఆవిష్కరించారు. సత్యనారాయణ పాల్గొన్నారు.



విద్యా కేంద్రంగా మార్కాపురం


మార్కాపురం పట్టణం వ్యూ

మార్కాపురం: విద్యా కేంద్రంగా మార్కాపురం వెలుగొందుతోంది. ఈ ప్రాంత విద్యార్థులు ఒకప్పుడు విద్యకోసం సుదూర ప్రాంతాలకు వెళ్లేవారు. డివిజన్ కేంద్రమైన మార్కాపురంలో ప్రస్తుతం అత్యుత్తమ విద్యా ప్రమాణాలతో అనేక విద్యా సంస్థలు అందుబాటులోకి వచ్చాయి. విద్యార్థుల బంగారు భవితకు బాటలు వేస్తూ పట్టణంలో పలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు మెరుగైన విద్యనందిస్తున్నాయి. ఏటా ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయి. మార్కాపురం పట్టణంతో పాటు చుట్టుపక్కల మండలాలైన తర్లుపాడు, పెద్దారవీడు, మార్కాపురం రూరల్ నుంచి పెద్ద ఎత్తున విద్యార్థులు హాస్టల్‌లో ఉంటూ విద్యనభ్యశిస్తున్నారు. పలు ఇంజినీరింగ్, ఫార్మసీ, లా, అగ్రికల్చర్, నర్సింగ్ కళాశాలలు ఉండటంతో చుట్టుపక్కల జిల్లాలతోపాటు దూర ప్రాంతాల నుంచి కూడా విద్యార్థులు ఇక్కడికి వచ్చి చదువుకుంటున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విద్యార్థుల సౌకర్యం కోసం బస్ సౌకర్యంతోపాటు హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. పాఠశాల యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు సౌకర్యంగా వసతులు ఏర్పాటు చేస్తున్నాయి. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉత్తమ విద్యను అందించి, భవిష్యత్తు తరాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నారు. విద్యార్థులకు క్రీడలు, సంగీతం, నృత్యాల్లో శిక్షణ ఇప్పించి మానసికంగా, శారీరకంగా దృఢంగా తయారయ్యేలా తోడ్పాటు అందిస్తున్నారు. విద్యార్థుల్లో ప్రతిభా నైపుణ్యాలను వెలికితీసేందుకు కృషి చేస్తున్నారు. ఇక్కడి విద్యార్థులు సాఫ్ట్‌వేర్‌లుగా, డాక్టర్లుగా, ఇంజినీర్లుగా తయారై దేశ, విదేశాల్లో కొలువులు సాధించారు. లక్షల్లో జీతాలు అందుకుంటున్నారు. ఉన్నత విద్యల్లో రాణించడమే కాకుండా ఉన్నత స్థానాలకు చేరుకున్నారు. పట్టణంలోని మార్కాపురం-తర్లుపాడు రోడ్డులో శ్రీ సాయి బాలాజీ స్కూల్, పట్టణంలోని జీఎంఆర్ హైస్కూల్, కళాశాల రోడ్డులోని శ్రీ అరవింద హైస్కూల్, శ్రీ సాయి చైతన్య హైస్కూల్, పట్టణంలోని నాగులవరం రోడ్డులో ఉన్న విజ్ఞాన్ హైస్కూల్‌తో పాటు జ్ఞానశ్రీ అకాడమీ విద్యార్థులు ఉత్తమ విద్యాబోధనతో మార్కాపురంలో విద్యా రంగానికి తలమానికంగా ఉన్నాయి.

విద్యా రంగంలో దూసుకెళ్తున్న విద్యా సంస్థలు


గిద్దలూరు పట్టణం వ్యూ

గిద్దలూరు రూరల్: గిద్దలూరు పట్టణంలో పలు విద్యా సంస్థలు విద్యారంగంలో ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నాయి. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు గిద్దలూరులో పలు ప్రైవేటు విద్యా సంస్థలు ఏర్పాటు చేశారు. పేద, మధ్యతరగతి విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను చేరువచేశారు. క్రమశిక్షణతో విద్యాబోధన చేస్తూ విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. గిద్దలూరు విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. పట్టణంలోని విశ్వభారతి ఐఐటీ ఫౌండేషన్ స్కూల్, సూర్య విద్యానికేతన్‌స్కూల్, అరుణోదయ పబ్లిక్ స్కూల్ వంటి ప్రైవేటు పాఠశాలలు విద్యార్థులకు మెరుగైన విద్యను అందిస్తున్నాయి. విద్యారంగంలో గిద్దలూరు చుట్టుపక్కల గ్రామాల్లో మంచి గుర్తింపు సాధించాయి.